



మెడికల్ కాలేజీ ఆవరణను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల



విద్యావంతుడి విముఖిత

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొత్తగూడెం, ఫిబ్రవరి 5: వారంతా పట్టభద్రులు... డిగ్రీలు పూర్తిచేసి ఉద్యోగాల్లో ఉన్నవారు కొందరు.. నిరుద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు మరికొందరు.. వీరందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు 'పట్టభద్రుల' ఎమ్మెల్సీ ఓటు.. డిగ్రీ పూర్తి చేసి ఉంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదయ్యేందుకు అవకాశం ఉంది. కానీ త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదయ్యేందుకు చాలామంది అనాసక్తి చూపుతున్నారు. మంగళవారం 6వ తేదీతో ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు వరకు ముగుస్తుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 83,446 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఖమ్మం జిల్లా నుంచి 53,463మంది, 29,983మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకుని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టబద్రులు పెద్దసంఖ్యలో ఉన్నా ఓటరుగా చేరేందుకు మాత్రం ఉత్సాహం చూపడంలేదు. రాజకీయపార్టీలు కూడా ఓటరు నమోదుపైన దృష్టిపెట్టడంలేదు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఉప ఎన్నిక జరగుతుంది. గతంలో బీఆర్ఎస్ మద్దతుదారుడు పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మరో నాలుగేళ్లపాటు పదవిలో ఉండే ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేయాలంటే ప్రతి ఒక్క పట్టభద్రుడు ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా మండల తహసీల్దార్ కార్యాలయాలకు లేదా ఇతర ఎన్నికల సహాయ అధికారుల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఓటరుగా చేరేందుకు గత డిసెంబరు 30న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 6 వరకు ఫారం-18 ద్వారా ఓటుకోసం దరఖాస్తు చేసేందుకు గడువు విధించారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించి 21న ముసాయిదా ఓటరు జాబితా

- ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు పట్టభద్రుల అనాసక్తి
- ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 53,463మంది దరఖాస్తు
- భద్రాద్రి జిల్లాలో 29,983
- గతంతో పోల్చితే భారీగా తగ్గిన అర్జీలు
- దరఖాస్తుకు నేటివరకే అవకాశం

సిద్ధంచేసి 24న ప్రచురిస్తారు. ఇందుకు సంబంధించిన అభ్యంతరాలను 24 నుంచి మార్చి 14 వరకు స్వీకరిస్తారు. మార్చి 29న వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ఏప్రిల్ 4న తుది జాబితా ప్రచురించనున్నారు. అయితే తుది జాబితా ప్రకటించే వరకు కూడా ఓటరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించింది. ఆ తర్వాత వచ్చే ఓటరు దరఖాస్తులను పరిశీలించి ఓటరు అర్హత ఉంటే ప్రచురించిన జాబితాకు జతచేయనున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో పట్టభద్రుల సంఖ్య అధికంగా ఉన్నా గతంలోమాదిరిగా ఉత్సాహంగా ముందుకు రావడంలేదు. 2021లో ఖమ్మంజిల్లా పరిధిలో 87,172మంది ఓటరుగా నమోదు కాగా ప్రస్తుతం ఇప్పటి వరకు 53,463మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా మిగిలిన వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోను గతంకంటే స్వల్పసంఖ్యలోనే దరఖాస్తు చేసుకున్నారు. ఈ జిల్లాలో గతంలో 42,679 మంది ఎమ్మెల్సీ ఓటు పొందగా ప్రస్తుతం 29,983మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. పట్టభద్రులుగా దరఖాస్తు చేయాలంటే 2020 అక్టోబరు 31లోపు ఏదైనా యూనివర్శిటీ నుంచి డిగ్రీ పట్టా పొంది ఉండాలి. దీంతోపాటు ఆధార్‌తోపాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ సంతకాలతో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు నేడు చివరితేది కావడంతో ఎన్నికల యంత్రాంగం పట్టభద్రులు ఓటరుగా చేరాలని కోరుతోంది.

ఖమ్మం మెడికల్ కాలేజీకి
శాశ్వత భవనాలు

- రూ.108కోట్లతో సూపర్ స్పెషాలిటీ వైద్యవిద్య, సేవలు అందించేందుకు ఏర్పాట్లు
- కళాశాలను సందర్శించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- అవసరమైన స్థలాన్ని గుర్తించాలని ఖమ్మం కలెక్టర్‌కు సూచన



కళాశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

ఖమ్మం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సూపర్‌స్పెషాలిటీ స్థాయిలో వైద్యవిద్య బోధన, రోగులకు అవసరమైన వైద్యసేవలందించేందుకు రూ.108కోట్లతో శాశ్వత భవనాలను ప్రభుత్వం నిర్మించబోతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సోమవారం మంత్రి తుమ్మల పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. కొత్త మెడికల్ కాలేజీ మంజూరైనప్పుడు రూ.10కోట్లతో తాత్కాలిక వసతులు ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు మాత్రమే ఉండడంతో వారికి అవసరమైన వసతులు ఏర్పాటు చేసి విద్యాబోధన కొనసాగిస్తున్నారని అయితే ప్రతిఏటా వైద్య విద్యార్థులు పెరగడంతోపాటు ఖమ్మంలో సూపర్‌స్పెషాలిటీస్థాయిలో పీజీ కళాశాలగా కూడా అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉన్నందున ఆ స్థాయిలో విద్యాబోధనకు అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ప్రజలకు అందేలా అధునాతన వసతులతో భవనాలు నిర్మించబోతున్నామన్నారు. ఇందుకు కావాల్సిన స్థలాన్ని గుర్తించేందుకు చొరవ తీసుకోవాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సూచించారు. ప్రస్తుతం పాతభవనాల్లో ఉన్న వసతులు భవిష్యత్ అవసరాలకు సరిపోవని, అందువల్ల సువిశాలమైన స్థలంలో భవనాలు ఉండేలా కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. అంతకుముందు మెడికల్ కళాశాల ఆవరణను మంత్రి తుమ్మల పరిశీలించి వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన ఆడిటోరియం, క్రీడామైదానాలు, ఇతర వసతులు ఉండాలని సూచించారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల ఆవరణలోని ఖాళీ భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలేజీకి చెందిన ఆసుపత్రిలోని సౌకర్యాలను కూడా త్వరలోనే పరిశీలిస్తానని తెలిపారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. పాలనాపరమైన ఇబ్బందులుంటే అధికారులు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, వారికి అవసరమైన విద్యా సౌకర్యాలు సమకూర్చాలని మంత్రి వివరించారు. మంత్రి పర్యటన, సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రాములునాయక్, వైద్యకళాశాల వైస్‌ప్రిన్సిపాల్ పి.సరిత, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, వైద్యారోగ్యశాఖ ఇంజనీరింగ్ ఈఈ ఉమామహేశ్వరరావు, మెడికల్ కాలేజీకి సంబంధించిన పలు విభాగాల అధికారులు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ బాబురత్నాకర్, డాక్టర్ రాథోడ్‌నాయక్, డాక్టర్ ఎం.రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు
ఎల్లోగోల్డ్ మిర్చి

- కొత్తరకం మిరప కాయలను ఆసక్తిగా తిలకించిన రైతులు
- మార్కెట్‌కు పోటెత్తిన తేజా రకం మిర్చి..
- ఒక్కరోజే 65వేల బస్తాల రాక



అమ్మకానికి వచ్చిన తేజా మిర్చి (ఇన్‌సెట్)లో ఎల్లోగోల్డ్ మిర్చి

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 5: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం కొత్తరకం మిర్చి పంట అమ్మకానికి వచ్చింది. 'ఎల్లోగోల్డ్' అనే పిలిచే ఈ కొత్తరకం మిర్చి సుమారు 10బస్తాలు అమ్మకానికి వచ్చాయి. సహజంగా ఎరుపు రంగు ఉండే మిర్చి పసుపు రంగులో ఉండటాన్ని చూసి రైతులు, హమాలీలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ అరుదైన పంటను సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం ఎత్తిరాజాపురం గ్రామానికి చెందిన భూక్యా శ్రీను అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో సాగుచేశాడు. ఈ ఎల్లోగోల్డ్ మిర్చి పంటకు డిమాండ్ సైతం ఎక్కువగానే ఉంటుంది. గతేడాది ఈ రకం మిర్చి క్వింటా రూ.40 వేలు ధర పలకగా ఈ ఏడాది ప్రస్తుతం కొంత డిమాండ్ తగ్గి క్వింటాలుకు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ధర పలుకుతోంది. ఈ ఎల్లోగోల్డ్ మిర్చి నుంచి తీసిన ఆయిల్ ఆయుర్వేద మందులలో ఉపయోగిస్తారని, దాని పిప్పిని చిప్స్ తయారీలో ఉపయోగిస్తారని వ్యాపార నిపుణులు చెబుతున్నారు.

పోటెత్తిన ఎర్రబంగారం

ఇక ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (ఎండుమిర్చి) పోటెత్తింది. సోమవారం సుమారు 65 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో పంట ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం.. తేజా రకం డీలక్స్ ఎండు మిర్చి క్వింటాలుకు రూ.21,600 జెండాపాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలుకు కనిష్ఠంగా రూ.14,000, నమూనా రకాలను క్వింటాలుకు రూ.19,500 వరకు కొనుగోలు చేశారు. తాలు మిర్చి సైతం రకాలను బట్టి క్వింటాలుకు రూ.8,000ల నుంచి రూ.11,000 వరకు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్ టూ కార్యదర్శి బజారు, ఏఎస్ వజీరుద్దీన్ తదితరులు సమీక్షించారు.



'గూడెం' గులాబీలో
అలజడి

- అవిశ్వాస తీర్మానానికి సమీపిస్తున్న గడువు
- విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్న ప్రతినిధులు

7

పైసా వసూల్ !

- వేంసూరు తహసీల్‌లో మారని తీరు
- పర్మిషన్లు, ధ్రువపత్రాల జారీలో చేతివాటం
- అందినకాడికి దోచుకుంటున్న వైనం

అట్టుడికిన బొగ్గుట్ట

- రణరంగంగా ఇల్లెందు మునిసిపల్ కార్యాలయం
- సినీపక్కీలో కౌన్సిలర్లపై దాడులు, కిడ్నాప్
- కోరం లేక చైర్మన్ డీవీపై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం
- ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే కనకయ్యపై కిడ్నాప్ కేసు నమోదు



మునిసిపాలిటీ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

ఇల్లెందు, ఫిబ్రవరి 5: మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గించాలని బీఆర్ఎస్.. ఓడించాలని కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలు.. దాడులు, కిడ్నాప్‌లతో ఇల్లెందు పట్టణం సోమవారం అట్టుడికింది. ప్రజాప్రతినిధులే బాహబాహికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇల్లెందు మున్సిపాలిటీలో సోమవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం 'కోరం' లేక పోవడంతో వీగిపొయింది. ఇల్లెందు మునిసిపాలిటీలో 24మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యుడి హోదాలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిపి మొత్తం 25మంది సభ్యులు ఉన్నారు. అయితే కొత్తగూడెం ఆర్‌డీవో శిరీష ఆధ్వర్యంలో ఏర్పాటు



కౌన్సిలర్ ఆచూకీ చెప్పాలంటూ కుటుంబ సభ్యుల ధర్నా

చేసిన మునిసిపల్ ప్రత్యేక సమావేశానికి 2/3వంతు సభ్యులు హాజరుకావాల్సి ఉండగా మునిసిపల్ కార్యాలయం వద్ద ఉత్పన్నమైన పరిణామాలు దాడులు, కిడ్నాప్ ఘటనలతో బీఆర్ఎస్‌కు చెందిన 15మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, ఆయన మద్దతుదారులు సమావేశానికి హాజరు కాలేదు. సమావేశ కోరం పూర్తి కావడానికి 17మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉండగా 15మంది మాత్రమే రావడంతో కోరం పూర్తిగాక అవిశ్వాసం వీగిపోయింది.

దాడులు, కిడ్నాప్‌తో ఉద్రిక్తం

అవిశ్వాస సమావేశం సందర్భంగా ఇల్లెందు మునిసిపల్ కార్యాలయం రణరంగంగా మారింది. నాయకుల దాడులు, కిడ్నాప్‌లు సినిమా దృశ్యాలను తలపించాయి. ఇల్లెందు బీఆర్ఎస్ నాయకుడు కొండపల్లి గణేష్ నాయకత్వంలో నిర్వహించిన క్యాంపు నుంచి 17మంది కౌన్సిలర్లు సోమవారం ఉదయం సమావేశంలో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఈ సమయంలో ఆఫీసుకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ కౌన్సిలర్లను అడ్డుకుని కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరరావు, అజాంలను ఎమ్మెల్యే కనకయ్య ఆయన అనుచరులు బలవంతంగా తమ వెంట లాక్కుపోతుండగా కౌన్సిలర్ అజాం తప్పించుకొని కౌన్సిల్ హాల్‌కు పరిగెత్తాడు. కాగా కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరావును ఎంపీపీపీ కార్యాలయంలో నిర్బంధించారు. అదే సమయంలో సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు చితకబాదారు. ఈ దాడిలో రవిందర్ చొక్క చిరిగిపోయినా లెక్క చేయకుండా ఆయన మునిసిపల్ అఫీస్‌కు పరుగు తీశాడు. బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బలవంతంగా ఎత్తుకెళుతుండగా మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అడ్డుకున్నా ఆమెను సైతం నెట్టివేసి ఎంపీపీ కార్యాలయంలో నిర్బంధించారు. అనంతరం ఇరువర్గాలు బాహాబాహికి తలపడ్డాయి. ఈ సమయంలో ఎంపీపీ కార్యాలయం నుంచి కౌన్సిలర్ నాగేశ్వరావును ఎమ్మెల్యే కనకయ్య తన కారులో ఎక్కించుకొని గుర్తు తెలియని ప్రదేశానికి తరలించారు. తరువాత సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్‌కు సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాష, జిల్లా నాయకుడు కే.సారయ్య ఆయనకు పార్టీ విప్‌ను అందజేశారు. తరువాత ఆయన అవిశ్వాస సమావేశంలో పాల్గొనకుండా అదృశ్యమయ్యాడు. దాదాపు మూడు గంటల పాటు మునిసిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ నాటకీయ పరిణామాల అనంతరం ఉదయం 11గంటలకు ఆర్డీవో శిరీష ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో కోరం పూర్తి కావడానికి హాజరు కావాల్సిన 17మందిలో 15మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరు కావడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో శిరీష ప్రకటించారు. కాగా తన భర్త నాగేశ్వరావును ఎమ్మెల్యే కనకయ్య, మునిసిపల్ చైర్మన్ డీవీ కిడ్నాప్ చేశారని, సమావేశానికి హాజరైన తన భర్తకు రక్షణ కల్పించలేదని పోలీసుల తీరుపై అగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ భార్య కొక్కు వెంకటలక్ష్మి తన కుతురు బంధువులతో మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో 15 మంది కౌన్సిలర్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఈ ఘటనలపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా శాంతి భద్రతల పరిరక్షణకు ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహ్మాన్‌ల ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలను మొహరించినా ఇరు పార్టీలనుంచి భారీగా హాజరైన కార్యకర్తలను అదుపు చేయలేకపోవడం గమనార్హం..

ఎమ్మెల్యే కనకయ్యపై కిడ్నాప్ కేసు

మునిపల్ చైర్మన్ దమ్మాలపాటిపై సోమవారం జరిగిన అవిశ్వాస ఓటింగ్‌లో పాల్గొనకుండా బీఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును కిడ్నాప్ చేశారని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు మరో 16మందిపై ఐపీసీ 365సెక్షన్ ప్రకారం కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు సీఐ టీ కరుణాకర్ సోమవారం రాత్రి తెలిపారు. కాగా కిడ్నాప్‌నకు గురైన నాగేశ్వరరావును సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో విడుదల చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



గృహజ్యోతికి కసరత్తు

- కేటగిరి-1 వియోగదారులకు ఉచిత విద్యుత్
- జిల్లాలో 80శాతం మంది అర్హులు ?
- నేటి నుంచి మీటర్ రీడింగ్‌తో పాటు వివరాల సేకరణ

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 5: విద్యుత్ వినియోగంలో కేటాగిరీ-1లో ఉన్న వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించడంతో జిల్లాలో ఆ కేటగిరిలో ఉన్న వినియోగదారుల జాబితా సిద్ధం చేసేందుకు విద్యుత్‌శాఖ సిద్ధమవుతోంది. విద్యుత్ వినియోగ స్థాయిని బట్టి వినియోగదారులను తొమ్మిది కేటగిరీలుగా విభజిస్తారు. ఖమ్మం జిల్లాలో కేటగిరి-1లో 4,84,128 గృహ వినియోగదారులు, కేటగిరి-2లో 59,861మంది నాన్ డోమస్టిక్ వినియోగదారులు, కేటగిరి-3లో 3,715 పరిశ్రమ వినియోగదారులు, కేటగిరి-4లో 495లో పరిశ్రమలు, కేటగిరి-5లో 1,14,991 వ్యవసాయ వినియోగదారులు, కేటగిరి-6లో 7,663 వీధి వ్యాపారులు, కేటగిరి-7లో 3,255 పరిశ్రమలు, కేటగిరి-8లో 845 వినియోగదారుల, కేటగిరి-9లో 2 విద్యుత్ బంక్‌లతో జిల్లాలో మొత్తం 6,75,790విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి.

గృహ వినియోగంలో 80శాతం మందికి ఉచితమే ?

జిల్లాలో కేటగిరి-1, 2 పరిధిలో గృహ వినియోగదారులు ఉండగా కేటగిరి-1లో తక్కువ విద్యుత్ వినియోగం చేసే వారిని గుర్తిస్తారు. వీరికి విద్యుత్ యూనిట్ చార్జీలను తక్కువగా విద్యుత్‌శాఖ వసూలు చేస్తోంది. అయితే ఇటీవల ప్రజాపాలన గ్రామ సభల్లో వచ్చిన 'గృహజ్యోతి' లెక్కల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. జిల్లాలో కేటగిరి-1లో మొత్తం 4,84,128 మంది వినియోగదారులు ఉండగా వారిలో కేటగిరి-1లో 0నుంచి 50యూనిట్లు, 51నుంచి 100 యూనిట్లు, 101నుంచి 200యూనిట్లు వినియోగించే వారి సంఖ్య సుమారుగా 3,85,500వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. 'గృహజ్యోతి' పథకంపై టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు. కేటగిరి-1 విభాగంలో 80శాతం మేరకు ఉచిత విద్యుత్ అందే అవకాశం ఉందన్నారు.

నేటి నుంచి మీటర్ రీడింగ్‌తో పాటు వివరాల సేకరణ

గృహజ్యోతి పథకంపై టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎండీ రిజ్వీ సోమవారం అన్ని జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం నుంచి నమోదు చేసే విద్యుత్ మీటర్ల రీడింగ్ సమయంలో 200యూనిట్లు కంటే తక్కువగా విద్యుత్ వినియోగించే విద్యుత్ గృహ వినియోగదారుల నుంచి ఆధారాలు సేకరించాలని ఆదేశించారు. ప్రాథమిక సమాచారం మేరకు తక్కువగా విద్యుత్ వినియోగించి తెలుపు రేషన్‌కార్డు పరిధిలోని గృహ వినియోగదారుల ఆధార్ నెంబర్‌తో పాటుగా రేషన్‌కార్డు సంఖ్యను మీటరు రీడింగ్‌తో పాటుగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. దీంతో 'గృహజ్యోతి' ఉచిత విద్యుత్ పథకానికి తొలి అంకం మొదలైంది.

అలరించిన కౌసల్య సుప్రజ రామా

- నేటితో ముగియనున్న భద్రాద్రి కళాభారతి నాటకోత్సవాలు



సినీ నటుడు పృథ్వీరాజ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

భద్రాచలం, ఫిబ్రవరి 5: దక్షిణ అయోధ్య భద్రాచలంలో భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 'కౌసల్యసుప్రజ రామా' అనే నాటికను ప్రదర్శించారు. బిడ్డలు సముద్రాలు దాటి వెళ్లిపోతున్నా.. వద్దనుకొని ఇంటి నుంచి వెళ్లగొడుతున్నా అమ్మ మనస్సు బిడ్డలను ఎప్పుడు అంటిపెట్టుకొనే ఉంటుందని, బిడ్డల కష్టాలకు, కన్నీళ్లకు ఓదార్పుగా నిలబడుతూనే ఉంటుందనే సందేశాన్నిచ్చే కౌసల్య కథే ఈ 'కౌసల్య సుప్రజ రామా' నాటకం.. కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ వారిచే ప్రదర్శించిన ఈ నాటికకు కథ మూలం ఆకెళ్ల శివప్రసాద్, నాటకీకరణ స్నిగ్ధ, దర్శకత్వం గోపరాజు విజయ్ నిర్వహించారు. అలాగే నాన్న నేనొచ్చేస్తా అనే నాటికను ప్రదర్శించనున్నారు. మంగళవారం ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

నటుడు పృథ్వీరాజ్‌కు ఆత్మీయ సత్కారం

నాటకోత్సవాల్లో భాగంగా ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్‌కు భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అలాగే ప్రముఖ జానపద కోయిల జంగిరెడ్డి, సునీతలను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో నాటక రంగానికి సేవలందిస్తున్న భద్రాద్రి కళాభారతి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. చివరి సింగర్ పార్వతి, ప్రముఖ జానపద గాయకుడు శంకర్‌బాబు, పాల్వంచ కళాపరిషత్ వ్యవస్థాపకుడు వేముల కొండలరావులను సత్కరించనున్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కళాభారతి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్, కార్యదర్శి అల్లం నాగేశ్వరరావు, తిప్పన సిద్ధులు, వంశీకృష్ణ, పొడిచేటి సత్యనారాయణచారీ, నరసింహారావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

విత్తు పేరుతో చిత్తు

» కంపెనీల ఉచ్చులో పడి మక్కరైతుల విలవిల » గింజలు లేని విత్తన కంకులు చూసి లబోదిబో

» కలెక్టర్‌కు బాధిత అన్నదాతల ఫిర్యాదు » క్షేత్రస్థాయిలో కంపెనీ ప్రతినిధుల పరిశీలన

» ఎకరానికి రూ.70 వేల పరిహారానికి సుముఖత

కొణిజర్ల/వైరా, ఫిబ్రవరి 5: అంతన్నారు, ఇంతన్నారు. దిగుబడి బంపర్ అన్నారు. పైగా విత్తన మొక్కజొన్న కావడంతో ధర కూడా బాగుంటుందని చెప్పారు. నమ్మిన రైతులు విస్తారంగా సాగు చేశారు. పంట ఏపుగా పెరిగింది. కంకులు కూడా పొడుగ్గా కన్పించాయి. పంటను చూసి రైతులు సంబరపడ్డారు. పడ్డ కష్టానికి లాభాలు వచ్చినట్టే అనుకున్నారు. కానీ తీరా కంకిని చూస్తే గింజలు లేవు. వేలకువేలు పెట్టుబడులు పెట్టి, కళ్లల్లో ఒత్తులేసుకుని పంటను కాపాడుకుంటే తీరా గింజలు లేని కంకులు ఉండటంతో కన్నీటిపర్యంతమవడం అన్నదాతల వంతయింది. ఏపుగా పెరిగిన చేనును చూసి మురిసిపోయిన రైతులు.. గింజలు లేని కంకులను ఏం చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర బాగుంటుందని చెప్పడంతో..

బహిరంగమార్కెట్‌లో ధర బాగుండటంతో ఓ కంపెనీకి చెందిన ప్రతినిధులు వైరా, కొణిజర్ల మండలాలకు చెందిన రైతులను కలిసి విత్తన మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. సాగర్ నీళ్లు రాకపోవడం, వానాకాలం పంటల్లో దిగుబడులు రాకపోవడంతో రైతులు దానికి సరే అన్నారు. ఆ కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన ఆడ-మగ విత్తన మొక్కజొన్న సాగు చేశారు. విత్తనాలు ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు రైతులుతో ఎటువంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. పైగా విత్తనాలు ఇచ్చినప్పుడు రశీదు కూడా ఇవ్వలేదు. కంపెనీ ప్రతినిధులు చెప్పినట్టు మొక్కజొన్న సాగు చేశారు. వైరా, కొణిజర్ల మండలాల్లో 300 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వాస్తవానికి వంద రోజుల్లో మొక్కజొన్న కోతకు వస్తుంది. రైతులు మొక్కజొన్న వేసి కూడా వంద రోజులు కావడంతో కంకులు విరిచి చూడగా.. పది నుంచి ఇరవైకి మించి గింజలు లేవు. దీంతో లబోదిబోమ నడం రైతులవంతయింది. కంపెనీ ప్రతినిధులు సాగుకు ముందు ఎకరానికి 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే 30 క్వింటాళ్లు కాదు కదా మూడు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితిలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరిగిన నష్టంపై కంపెనీ నుంచి భరోసా వస్తుందని ఇంకా రైతులు ఆశలో ఉన్నారు.

నమ్మి సాగు చేశాం
కొమ్మిని బాబు రైతు కొణిజర్ల



మంచి విత్తనాలు అని కంపెనీ ప్రతినిధులు చెప్పటంతో నేను రెండు ఎకరాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేశాను. ఇప్పటి వరకు లక్షన్నర వరకు పెట్టుడులు పెట్టా. కంకికి విత్తనమే సరిగా పట్టలేదు. ఎంతో ఆశపడితే నిరాశ ఎదురవుతోంది. కంపెనీ వారు స్పందించి జరిగిన నష్టాన్ని చూసి.. పరిహారం ఇవ్వాలి. లేకుంటే మాకు అప్పులే మిగులుతాయి.



విత్తనాలు లేని కంకులను ఏవోకు చూపుతున్న రైతులు

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

వైరా, కొణిజర్ల మండలాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను వ్యవసా యశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఓ కంపెనీకి చెందిన ఆడ, మగ మొక్కజొన్న పంటలకు సంబంధించి దిగుబడి తగ్గే ప్రమాద ముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 300ఎకరాల్లోని పంట విత్తన లోపం, వాతావరణ మార్పుల నేపథ్యంలో దిగుబడులు తగ్గే అవకాశాలుం డటంతో రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఫిర్యాదుపై స్పందించి సమగ్ర నివేదిక ఇవ్వాలని వైరా ఏడీఏ వి.బాబూరావు, వైరా, కొణిజర్ల ఏవోలను ఆదేశించారు. కంపెనీ ప్రతినిధి ఒకరిని వైరా మండల వ్యవసాయ కార్యాలయానికి పిలిపించి రైతుల సమక్షంలో ఏడీఏ వి.బాబూరావు, ఏవో ఎస్.పవన్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు సరాసరి 28 క్వింటాళ్ల చొప్పున క్వింటా ఒక్కింటికి రూ.2500ధర ప్రకారం రూ.70వేల చొప్పున రైతులకు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధి సుముఖత వ్యక్తం చేయగా రైతులు మాత్రం ఎకరాకు రూ.80వేలపైచిలుకు పరిహారం ఇవ్వాలని కోరారు. దిగుబడితో సంబంధం లేకుండా ఎకరాకు రూ.80వేలు ఇవ్వాలని రైతులు కోరగా కంపెనీ మా త్రం రూ.70వేలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే ఇచ్చే పరిహారం కూడా తాము విక్రయించిన పంటతో కలిపి ఒకేసారి తమకు చెల్లించాలని రైతులు కోరా రు. అయితే ముందుగా రైతులకు వచ్చిన పంట దిగుబడి బిల్లులు చెల్లించి ఆ తర్వాత మిగిలిన పరిహారాన్ని చెల్లించేందుకు కంపెనీ ప్రతినిధి ప్రతిపాదించగా రైతులు అందుకు అంగీక రించలేదు. ఈ నష్టంపై వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపించారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

దుమ్ముగూడెం/ ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 5: ఇరు జిల్లాల్లో ఆదివారం రాత్రి, సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ము గ్గురు దుర్మరణం చెందారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని సీతానగరానికి చెందిన తుష్టి శ్రీను(30) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎటపాక మండలం కన్నాయిగూడెం సమీప చర్ల-భద్రాచలం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జామాయిల్ లోడు దింపి ఖాళీ ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఇంజన్ ముందు టైర్ ఊడిపోవడంతో రోడ్డు పక్కగా బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న శ్రీను ఇంజన్ కింద పడి నలిగి తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. కాగా ప్రమాద సమయంలో ట్రాక్టర్‌పై మరో ఇద్దరు ఉండగా, వారు వెంటనే పక్కకు దూకడంతో తప్పించుకున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

ద్విచక్రవాహనం పల్టీ కొట్టి..

ద్విచక్రవాహనం పల్టీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు.ఈ సంఘటన ఖమ్మం రూరల్, మండలం, కాచిరాజుగూడెం పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా, దోర్నకల్ మండలం, ముల్కలపల్లికి చెందిన ఎస్‌కె జానిమియా (40) ఖమ్మంలోని జెండాల సెంటర్‌లో నివాసం ఉంటు పానేషాప్ న డుపుకుంటున్నాడు. ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం ముల్కలపల్లి వెళ్లి తిరిగి ఖమ్మం వస్తున్నాడు. రూరల్ మండలం, కాచిరాజుగూడెం శివారులో ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది ఈ ప్రమాదంలో జానిమియాకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జానిమియాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకూబ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో..

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సంఘటన ఖమ్మం రూరల్ మండలం, నాయుడుపేటలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నాయుడుపేటకు చెందిన వెంకటేశ్వర్లు (38) ప్రైవేట్ ఎలక్ట్రీషన్ గా పని చేస్తుంటాడు. వెంకటేశ్వర్లు, తన స్నేహితుడు సత్యనారాయణ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం రాత్రి నాయుడుపేట నుంచి ఖమ్మానికి టిఫిన్ చేసేందుకు వెలుతుండగా సెంటర్‌లో గుర్తుతెలియని వాహనం వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకూబ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, ఫిబ్రవరి 5: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక శివారులో గల గోదావరి నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్లు ద్వారా ఇసుక తరలిస్తున్నారని సమాచారంతో ఎస్ఐ రాజశేఖర్ దాడులు నిర్వహించారు. ఆదివారం రాత్రి సమయంలో చేపట్టిన దాడులలో సారపాకలోని రాజీవ్‌నగర్, భాస్కర్‌నగర్ ప్రాంతాలకు చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

బూర్గంపాడు, ఫిబ్రవరి 5: బూర్గంపాడు మండల పరిధిలో ఇటీవల కాలంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో మోరంపల్లిబంజర, బూర్గంపాడు, సోంపల్లి, గౌతపురం కాలనీలతో పాటు పలు గ్రామాలలోని తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యం గా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. అలాగే వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ ఎత్తుకెళ్లడం, విద్యుత్ మోటార్లు, తీగలు అపహరించడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కాగా చోరీ ఘటనలపై ఎస్ఐ రాజశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా క్లూస్ టీంతో పాటు పలు ఆధారాలను సేకరించామని నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఓ చోరీ ఘటనలో ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పాతర్లపాడులో..

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 5: మండలంలోని పాతర్లపాడులో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండుచోట్ల చోరీలకు పాల్పడ్డారు. పాతర్లపాడుకు చెందిన నారెడ్డి శంకర్ కిరాణం వ్యాపారం చేస్తున్నాడు. ఈనేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు దుకాణాల్లో తాళం పగులగొట్టి రూ.10 వేల నగదు, రూ.10 వేల మద్యం బాటిళ్లు, పదిలీటర్ల పెట్రోల్‌తో పాటు కిరాణ సరుకులు ఎత్తుకెళ్లారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన ఎనికే యాదయ్య ఇంటిలో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూ.15వేల నగదుతోపాటు 5గ్రాముల బంగారు వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితులు సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడి కేసులో 11మంది అరెస్టు, రిమాండ్

ఖమ్మంక్రైం/ ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన దాడి ఘటనలో 11మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. దాడా, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘర్షణల్లో పలువురు నిందితులపై టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదుచేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా నెహ్రూనగర్‌కు చెందిన కొల్లి ఉదయ్, ఖమ్మం విజేత, రేవతిసెంటర్ సమీప ప్రాంతానికి చెందిన షగిడికట్ల ప్రకాశ్, బీజేఆర్‌నగర్‌కు చెందిన పిండిపోల ఎలిషా, నెహ్రూనగర్‌కు చెందిన దంగ్రోత్ హస్సేన్, కొల్లి అభినయ్, రేవతిసెంటర్‌కు చెందిన చలపాక వినయ్, ముస్తఫానగర్‌కు చెందిన మండ సుబ్రహ్మణ్యం, ఖానాపురానికి చెందిన బుడగ అశోక్, దంసలాపురం కొత్తూరుకు చెందిన గుజులూరి వినోద్ మార్, గట్టయ్యసెంటర్‌కు చెందిన లింగోజు దిలీప్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

విషపూరితమైన నీరు తాగి 13 గొర్రెలు మృతి

కల్లూరు, ఫిబ్రవరి 5: విషపూరితమైన నీరు తాగి కల్లూరు మండలం కప్పలబంధం గ్రామంలో రూ. 3 లక్షల విలువగల 13 గొర్రెలు ఆది, సోమవారాల్లో వరుసగా మృతి చెందాయి. ఈ సంఘటనకు సంబంధించి కప్పలబంధానికి చెందిన వేల్పుల నరసింహారావు సుమారు 200 గొర్రెలను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆ క్రమంలో రోజు వారిగా తన గొర్రెల గుంపును తోలుకొని మేత కోసం వెళ్లాడు. ఇలా శనివారం తిరిగి గొర్రెలను ఇంటికి తోలుకొని వచ్చాడు. ఆదివారం ఉదయం ఎనిమిది గొర్రెలు మృతి చెంద గా, సోమవారం ఉదయం మరో ఐదు గొర్రెలు మృతి చెందాయి. దీంతో నరసింహారావు ఆందోళనకు గురయ్యాడు. ఈ మేరకు నరసింహారావు పశువైద్యాధికారి మమతకు సమాచారం అందించగా క్షేత్ర స్థాయిలో మృతి చెందిన గొర్రెలను పరిశీలించి పంచనామా చేశారు. విషపూరితమైన నీటిని తాగటంతో గొర్రెలు మృతి చెందాయని తెలిపారు. కాగా, గొర్రెలు మృతి చెందడంతో తనకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

బొమ్మాబొరుసు నిందితుల ఆటకట్టు

» మూడు రోజులుగా ప్రత్యేక బృందాల గాలింపు

» వాహనం నెంబరు ఆధారంగా దొంగల గుర్తింపు

» పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు

తల్లాడ, ఫిబ్రవరి 5: లిఫ్ట్ ఇస్తామని నమ్మించి టాటాసుమోలో వృద్ధ దంపతులను ఎక్కించుకొని పథకం ప్రకారం వారి వద్దనున్న రూ2.55 లక్షల నగలు, నగదును దోచుకున్న చోరీ కేసును పోలీసులు చేదించారు. మూడు పోలీసు బృందాలు మూడురోజులు పాటు రాత్రింబవళ్లు కష్టపడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి ఈ చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితు లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈనెల రెండో తేదీన వైరాలో లిఫ్ట్ ఇస్తామని నమ్మించి జూలూ రుపా డ్ మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన వృద్ధ దంపతు లను వాంకుడోతు కేతానాయక్, బాలీలను సు మోలో ఎక్కించుకొని పథకం ప్రకారం బొమ్మాబొ రుసు ఆట పే రుతో వీరి వద్దనున్న రూ.2.55లక్షల నగలు, నగదును దుండగులు అపహరించి తల్లాడ ఎన్టీఆర్ నగర్ సమీపంలో వాహనంలో నుంచి వృద్ధ దంపతు లను బయటకు గెంటేశారు. ఈ సంఘటన గురించి బాధిత వృద్ధ దంపతుల ఫిర్యాదు మేరకు తల్లాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా వైరా ఏసీపీ ఎం.ఎ.రెహ్మాన్ పర్యవేక్షణలో వైరా సీఐ ఎన్. సాగర్, వైరా, తల్లాడ ఎస్ఐలు మేడా ప్రసాద్, బి.కొండల్‌రావు పోలీసు సిబ్బందితో మూడు బృందా లుగా ఏర్పడి మూడురోజులపాటు రాత్రింబవళ్లు విస్తృతంగా గాలించారు. తల్లాడ, వైరా, కల్లూరు తదితర పోలీస్ స్టేషన్లతోపాటు వైరా బస్టాండ్ ఏరియాలోని పలు దుకాణాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి సుమో, నిందితుల కదలికలను సేకరించారు. చోరీ చేసేం దుకు నిందితులు ఉపయోగించిన టాటాసుమో కారు నెంబర్ కనపడకుండా కేవలం వాహనం ముందు నెంబ ర్‌ప్లేట్‌లో ఏపీ07టీవై మాత్రమే కన్పించేలా నాలుగు అంకెల నెంబర్‌కు గుడ్డ కట్టారు. వెనుక అసలు నెంబర్ ప్లేట్ లేకుండా చేశారు. దీంతో ఈ చోరీ కేసును చేదిం చటం పోలీసులకు సవాల్‌గా మారింది. అయినప్పటికీ తమకున్న నేరపరిశోధన, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించి ఈ చోరీ కేసును చేదించి నిందితులను పట్టుకోవడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. నిందితులు గుంటూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారని, గతం లో కూడా ఈ నిందితులకు నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మూడురోజుల వ్యవధిలోనే సంచలనం సృష్టించిన చోరీ కేసును చేదించిన సీఐ ఎన్.సాగర్, ఎస్ఐలు మేడా ప్రసాద్, బి.కొండల్‌రావులను ఉన్నతాధికారు లు అభినందించారు.

ఇచ్చేది ప్రభుత్వం.. పట్టుకునేది వారు

కాంట్రాక్టర్ల గుప్పిట్లో చెరువులు

మత్స్యసహకార సంఘాలను విభజించి పబ్బం

చేపలు వారే పట్టుకునేలా అగ్రిమెంట్

చేష్టలుడిగి చూస్తున్న మత్స్యశాఖ అధికారులు

నేలకొండపల్లి, ఫిబ్రవరి 5: గ్రామాల్లో ఉన్న చెరువుల్లో చేప పిల్లల పెంప కం, వేట ద్వారా గంగపుత్రులు, ముదిరాజ్‌లు ఉపాధి పొందుతారన్న లక్ష్యంతో ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసింది. మత్స్య సహకార సంఘాలకు చెరువుల్లో పెంచడానికి ఉచితంగా పిల్లలను పంపిణీ చే స్తున్నది. కానీ మత్స్య సహకార సంఘాలను కాంట్రాక్టర్లు తమ గుప్పిట్లో పె ట్టుకుంటున్నారు. మత్స్యకారులను వర్గాలుగా విభజించి పబ్బం గడుపుకుం టున్నారు. వీరికి ప్రభుత్వ అధికారులు అండగా నిలుస్తున్నారు. సొసైటీలను కాంట్రాక్టర్లకు అప్పగించకూడదని నిబంధనలు స్పష్టంగా చెపుతున్నప్పటికీ, సొసైటీలను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నప్పటికీ కళ్ళప్పగించి చూస్తున్నారే తప్ప కాంట్రాక్టర్లను నిలువరించే ప్రయత్నం చేయడం లేదు.



చెర్వుమాధారం పాజీద చెరువు

ఖమ్మం జిల్లాలోనే అతి పెద్ద చెరువుగా ఉన్న మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామంలోని పాజీద చెరువు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నది. దాదాపు 950 ఎకరాల విస్తీర్ణం(కొత్త ఆక్రమణలకు గురైంది)లో ఉన్న పాజీద చెరువులో ప్రస్తుతం 832 మంది సభ్యులతో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉంది. పాజీద చెరువులో ఏనాడూ మత్స్య సహకార సంఘం సభ్యులు చేపలు పట్టింది లేదు. కొట్ల రూపాయల ఆదాయం ఉండటంతో పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు చెరువు కోసం పోటీలు పడతారు. గతంలో రాజకీయ పార్టీల మధ్య గొడవలు కూడా జరిగాయి. తాజాగా పాజీద చెరువులో చేపలు పట్టుకోవటానికి కాంట్రాక్టర్లకు సభ్యులు అగ్రిమెంట్ రాసి ఇచ్చారు.

చెరువులో నిండా నీరు ఉండటంతో..

చెరువులో నిండా నీరు ఉండటం, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స దరు కాంట్రాక్టర్లు చేపలు పట్టలేక పోయారు. ఈలోగా ఇటీవల ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గం ఏర్పడటంతో కథ మొదటికొచ్చింది. సభ్యులు సమావేశం నిర్వహించి తిరిగి అదే కాంట్రాక్టరుకు చేపలు పట్టుకోవటానికి కొన్ని షరతులపై ఒప్పు కున్నారు. ప్రతి సభ్యుడికి రూ2వేల నగదు, 5కిజీల చేపలిచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. అది కూడా ఏప్రిల్ నెల లోపే పట్టుకోవాలనేది నిబంధన విధించారు. ఈనేపథ్యంలో కాంట్రాక్టర్ రెండు, లేదా మూడు రోజుల్లో పాజీద చెరువులో చేపల వేట ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. ప్రస్తుతం సంఘంలో ఉన్న ఆ ద్యుడు సంఘంలో సభ్యులు 832 మంది మాత్రమే అధికారికంగా ఉండగా 1030 మందికి డబ్బులు, చేపలివ్వాలని షరతు విధించినట్లు తెలుస్తోంది. పాజీద చెరువే గాకుండా మండలంలోని దాదాపు అన్ని చెరువులు కాంట్రాక్టర్ల చేతిలోనే ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ, ఫిబ్రవరి 5: మండలంలోని బంజరగూడెం శివారులోని కోడిపందాల స్థావరంపై పాల్వంచ రూరల్ పోలీసులు సోమవారం దాడి చేశారు. బరిలో కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కోడిపుంజు, మూడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు, రూ.11వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై

చర్యలు తీసుకోవాలి: నామా

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 5: రాజీవ్ స్వగృహలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ కు సోమవారం ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఈ ఘ టన ఆటవిక చర్యను ప్రతిబింబిస్తోందన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసినంత మాత్రాన ప్రజల గుండెల నుంచి ఆయనను తొలగించలేరన్నారు. కాగా, ఎంపీ ఫిర్యాదు మేరకు స్పందించిన సీపీ.. నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 5: విద్యుత్ షాక్‌తో యు వకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఇల్లెందు మం డలం సుభాష్‌నగర్ సెంటర్‌లో ఓ బైక్ షోరూమ్‌లో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు కారేపల్లి మండలం కొత్తతండా గ్రామానికి చెందిన విజయ్(19) బైక్ షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం ద్విచక్ర వాహనాన్ని వాటర్‌తో సర్వీసింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో హుటాహుటిన ఇల్లెందు ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా,పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.



విజయ్(ఫైల్)

అశ్లీల చిత్రాల ఫ్లెక్సీలు ప్రదర్శన..

యువకులపై కేసు నమోదు

దమ్మపేట, ఫిబ్రవరి 5 : అశ్లీల చిత్రాల ఫ్లెక్సీలు ప్రదర్శించిన యువకులపై దమ్మపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మపేట బంజరా కాలనికి చెందిన ఒక యువకుడి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం రాత్రి పార్టీ నిర్వహించారు. అశ్లీల చిత్రాలు సెంటర్‌లో ప్రదర్శించారు. ఆ వీడియో పలువురు ఇబ్బందులకు గురి చేశారు. రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఈ విషయం తెలుసుకున్న బ్లూకోట్ పీసీ వీరస్వామి ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై ఎస్సై సాయికిషోర్ రెడ్డి కేసు నమోదు చేశారు. అశ్లీల దృశ్యాలు ఉన్న ద్విచక్రవాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కామేపల్లి, ఫిబ్రవరి 5: పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కామేపల్లి మండలం పరిధిలోని అబ్బాస్‌పురంలో సోమవారం జరిగింది. ఆబ్బాస్‌పురానికి చెందిన దారావత్ నెహ్రూ (36) అనే రైతు కొలుకు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. మిర్చి పంట సాగు చేయగా తెగుళ్లు ఆశించి దిగుబడి రాకుండాపోయింది. పంట సాగుకు అప్పు తేవడం, దిగుబడి రాకపోవడంతో అది ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 3న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పశువుల పట్టివేత

భద్రాచలం, ఫిబ్రవరి 5: అక్రమంగా తీసుకెళ్తున్న పశువులను భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా సోమవారం ఈ విషయం వెలుగు చూసింది. ఏపీలోని కూనవరం మండలంలోని పోలి పాక గ్రామం సమీపంలోని ప్రాంతాలలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పశువులను వ్యానులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ పశువులను పశువుల సంతకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్కడి నుంచి రెండు బొలేరో వాహనాల్లో 26 పశువులను తీసుకెళ్తున్నారు. ఆ పశువులను పట్టుకుని గ్రామం కొత్త గూడెంలో అమ్మకోవడానికి ప్రయత్నించి నట్టు పోలీసులు తెలిపారు. ముగ్గురు నిందితులు సత్యం, గడ్డం లక్ష్మణ్, అన్నపురెడ్డి శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. పశువుల సంరక్షణ కొరకు గోశాలకు తరలించినట్టు తెలిపారు.

ఉద్యమకారులపై రౌడీషీట్ సరికాదు: ప్రజాపంథా

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 5: ఉద్యమకారులపై పోలీసులు రౌడీ షీట్ ముద్ర వేయడం సరికాదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఖమ్మం బైపాస్ రోడ్డులో జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లురావు ఆధ్వర్యంలో ఖమ్మం పోలీసు అధికారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీపీ పుల్లయ్యను రౌడీషీటర్లుగా పోలీసులు చేసిన ప్రకటన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, శిరోమణి, రూప్సి, కే శ్రీనివాస్, చందు, సురేశ్, లలిత, శోభ, కంకణాల శ్రీనివాస్, రవీంద్ర, లక్ష్మీనారాయణ, కొమరన్న పాల్గొన్నారు.



పోలీసు అధికారి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా జిల్లా నాయకులు

అర్ధరాత్రి అక్రమంగా మట్టి తోలకాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 5: ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టి తోలకాలు జరుపుతుండగా గ్రామస్తులు, అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున మండలంలోని పడమట నర్సాపురంలో జరిగింది. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పడమటనర్సాపురంలోని సర్వే నెం.162లో గల ప్రభుత్వ భూమి (అసైన్‌మెంట్)లో అనుమతులు లేకుండా అర్ధరాత్రి ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి వాహనాలలో సుజాతనగర్ మండలం సర్వారానికి తరలిస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొంతమంది అక్కడికి వెళ్లి మట్టి తోలకాలను అడ్డుకున్నారు. సమాచారాన్ని రెవెన్యూశాఖ అధికారులకు తెలియజేశారు. తహసీల్దార్ శారద ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి ఎస్ఐ తిరుపతిరావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది చేరుకొని తోలకాలను అడ్డుకున్నారు. ఒక జేసీబీతో పాటు, రెండు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తోలకాలు చేపట్టడంతో ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు, రెండు టిప్పర్లకు కలిసి రూ.50 వేల చొప్పున లక్ష రూపాయలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ శారద తెలిపారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తోలకాలు జరిపితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో పాటు రెండు టిప్పర్లు సీజ్

రూ. లక్ష జరిమానా: తహసీల్దార్



మట్టి తోలకాలను అడ్డుకున్న ఎస్ఐ తిరుపతిరావు, గ్రామస్తులు

రైల్లో కూతుర్ని మర్చిపోయిన తల్లిదండ్రులు

క్షేమంగా అప్పగించిన రైల్వే అధికారులు

మధిర, ఫిబ్రవరి 5: అర్ధరాత్రి సమయంలో రైలులోనే మర్చిపోయిన ఆరేళ్ల పాపను రైల్వే ఉద్యోగులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘ టన ఆదివారం అర్ధరాత్రి మధిరలో జరిగింది. రైల్వే అధికారులు చెందిన కొమరంభీం జిల్లాకు చెందిన రమేష్, వనజ దంపతులు తమ ఐదు సంవత్సరాల పాప ఆధ్యను తీసుకొని తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో ఖమ్మం నుంచి మధిర వచ్చారు. దంపతులు రైలు దిగే సమయం కావడంతో తమ ఐదు సంవత్సరాల పాపను రైలులో వదిలేసి ఆదుర్దాగా మధిరలో రైలు దిగిపోయారు. తమ పాప దిగలేదని గమనించే సరికే రైలు కదిలి వెళ్లిపోయింది. వెంటనే పాంచ్‌మెన్ కటారపు కృష్ణ సహాయంతో రైల్వే స్టేషన్ మాస్టర్ సల్మాన్ ఆబ్బాస్‌కి విషయం తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఆయన రైల్లో ఉన్న రైల్వే పోలీసు వెంకటేశ్వర్లుకు పాప ఫోటో పంపారు. విషయం వివరించి తర్వాత రైలు ఆగే రాయనపాడు స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతలోనే వెనకాలే వచ్చిన పద్మావతి ఎక్స్‌ప్రెస్ రావడంతో అందులో వనజ, రైల్వే పోలీసులు రాయనపాడు వెళ్లారు. అప్పటికే పాపను గుర్తించిన రైల్వే అధికారులు స్టేషన్ మాస్టర్ సంరక్షణలో ఉంచారు. ఈలోగా రమేష్, వనజ, రైల్వే పోలీసులు అక్కడికివచ్చారు. స్టేషన్ మాస్టర్ సమక్షంలో తల్లిదండ్రులకు పాపను క్షేమంగా అప్పగించారు. తల్లిదండ్రులు, పాపను తిరిగి రైల్వే అధికారులు నాగపల్లి ఎక్స్‌ప్రెస్‌లో మధిరకు పంపించారు. సమయానికి స్పందించిన స్టేషన్ మాస్టర్, రైల్వే ఉద్యోగులు, పోలీసులకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

కూతురు అని పిలుస్తూనే లైంగికదాడి

మద్యం మత్తులో ఛత్తీస్‌గఢ్ మహిళపై

తోటి కూలీల అఘాయిత్యం

రఘునాథపాలెం

పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 5: భర్త పెట్టే ఇబ్బందులను తాళా ల్సాయికి చేరడంతో ఆ ఇల్లాలు భరించలేకపోయింది. అతడి ఆగడాలు తట్టు కోలేక పొట్ట చేత పట్టుకుని, తన కూతుర్ని వెంట పెట్టుకుని సొంత రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ దాటి, జిల్లా దాటి ఖమ్మం జిల్లాకు వలస వచ్చింది. రఘునాథపాలెంలో తల దాచుకుంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తోంది. ఆ మెతో పాటు ఆ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు కూడా రఘునాథపాలెం వచ్చారు. వీరంతా కలిసి స్థానిక రైతుల చేలల్లో పనులకు వెళ్లే వారు. ఈ క్రమంలో వలస కూలీల్లో కొందరు ఆమెను కూతురి వరుసతో సం బోధించేవారు. అయితే వారిలో ఇద్దరు మగ కూలీలు పీకలదాకా మద్యం తాగి ఆ మ త్తులో కూతురు వరసవుతుంది అని కూడా చూడకుండా ఆ మహిళపై లైంగికదాడికి పాల్పడ్డారు. సీఐ శ్రీహరి కథనం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, రాయపూర్ గ్రామానికి చెందిన కూలీలు ఉపాధి కోసం రఘునాథపాలెం మండల కేంద్రానికి వలస వచ్చి రోజూ రైతుల క్షేత్రం చేలల్లో పనులకు వెళ్తున్నారు. ఆ క్రమంలో ఒకే ఇంట్లో ఆ మహిళ కూలీ (భర్తకు దూరంగా ఉంటూ) తన కూతురిని ఇటీవలే తీసుకుని తోటి కూలీలతో కలిసి రఘునాథపాలెం వచ్చింది. మహిళను కూతురు అని తోటి కూలీలు మన్‌శ్యామ్, చందీమాల్ సంబోధించే వారు. ఈ క్రమంలో మన్‌శ్యామ్, చందీ మాల్ కలిసి పీకలదాకా మద్యం తాగారు. ఫిబ్రవరి 1న రాత్రి 12 గంటల సమయంలో కూతురని సంబోధించే మహిళా కూలీ వద్దకు వెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. బాధిత మహిళ భర్తకు బాధిని రాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

రెండు లక్షల విలువైన గంజాయి పట్టివేత

భద్రాచలం, ఫిబ్రవరి 5: భద్రాచలంలోని అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద రూ.2 లక్షల విలువైన గంజాయిని ఎస్ఐ విజయలక్ష్మీ పట్టుకున్నారు. సోమవారం ఎస్ఐ తమ సిబ్బందితో చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బూర్గంపాడు ఉమ్మడి జిల్లాకు చెందిన బొట రాజేష్, రాజు అనుమానాస్పద స్థితిలో కన్పించారు. ఈ క్రమంలో వారిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమయింది. వీరు ద్విచక్ర వాహ నంపై ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లోని కలిమెల పరిసర ప్రాంతాల్లో రుషి అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసినట్లు పోలీసుల ఎదుట పేర్కొన్నారు. వీరు కొనుగో లు చేసిన గంజాయిని బూర్గంపాడు జిల్లాలో చిన్న చిన్న పొట్లాలుగా చేసి అవసరమైన వ్యక్తులకు అమ్మడానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మొదటి వ్యక్తి బొట రాజేష్ పట్టుకోగా రెండోవ్యక్తి రాజు మోటార్ సైకిల్ దిగి పరారయ్యాడు. నిందితుడి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయి ఒక మోటార్‌సైకిల్, ఒక సెల్‌ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని వివరించారు.



పైసా వసూల్..!

- వేంసూరు తహసీల్‌లో మారని తీరు
- పర్మిషన్లు, ధ్రువపత్రాల జారీలో చేతివాటం
- అందినకాడికి దోచుకుంటున్న వైనం



వేంసూరు, ఫిబ్రవరి 5: వేంసూరు మండల రెవెన్యూశాఖ తీరు మారటం లేదు. గతంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు నాయబ్ తహసీల్దార్, సర్వేయర్లను పట్టుకోగా, అంతకుముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌ను పలు ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా మండలంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు అదే పద్ధతిని కొనసాగిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రధానంగా ముగ్గురు ఉద్యోగులు పలు పథకాలు, ధ్రువపత్రాల జారీలో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతులు, ధ్రువపత్రాల జారీలో కూడా..

మండలంలో స్థానికంగా ఎవరైనా ఇళ్ల అవసరాలకు ఇసుక, మట్టి తెచ్చుకుంటే వారిని వేధించటంతో పాటు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వాగులలో క్వారీలు ఏర్పాటుచేసి ఇసుక భారీ స్థాయిలో అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా వెనుక భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు మండలంలో ఆరోపణలు ఉన్నాయి. ఇటుక బట్టీల వ్యాపారులను సైతం వదలడం లేదనే విమర్శలున్నాయి. మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిని పీడిస్తున్నారని మండలంలో పెద్దఎత్తున ప్రచారంలో ఉంది. ధరణిలో నాలా పర్మిషన్ నిమిత్తం చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. వ్యవసాయ, ఆదాయ ధ్రువపత్రాలు, మున్నూరుకాపు సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మీ మంజూరు, టేకు చెట్లు నరుక్కోవడానికి పర్మిషన్ నిమిత్తం, విద్యుత్ మోటార్ల కనెక్షన్ల నిమిత్తం సదరు ఉద్యోగులు పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్

ఈ విషయమై పలువురు బాధితులు సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల నిర్వహించిన అభయహస్తం గ్రామసభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా ఆ ఉద్యోగులు ఎమ్మెల్యే హెచ్చరికలను పెడచెవిన పెట్టారని మండలంలో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల తీరు మారకపోవడంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఫిర్యాదు చేయాలని పలువురు నిర్ణయించారు. మంత్రి అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖలో ఇంత జరుగుతున్నా అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆరోపణలపై వేంసూరు తహసీల్దార్ ఎంఎ.రాజును సంప్రదించగా ఫిర్యాదులు అందితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'గూడెం' గులాబీలో

అలజడి



- అవిశ్వాస తీర్మానానికి సమీపిస్తున్న గడువు
- విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్న ప్రజాప్రతినిధులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి5: కొత్తగూడెం పురపాలక రాజకీయం వేడెక్కుతోంది. గులాబీ పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య ఏర్పడ్డ అంతర్గత వర్గ విబేధాలు వీధినపడటంతో అవిశ్వాస తీర్మానం వైపు అడుగులుబడ్డాయి. కొత్తగూడెం పురపాలక చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ గత నెల జిల్లా కలెక్టర్ ప్రియాంకఅలకు 22 మంది కౌన్సిలర్లు ఫిర్యాదుచేశారు. దీంతో గులాబీ పార్టీలో అలజడి మొదలైంది. అధిష్ఠాన వర్గం ఇరు వర్గాల మధ్య ఏర్పడ్డ విబేధాలను రాజీ చేసేందుకు ప్రయత్నించినప్పటికి ఫలితం కనిపించలేదనే ప్రచారం కొనసాగుతోంది. దీంతో జిల్లా కలెక్టర్ కొత్తగూడెం మున్సిపాలిటి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ఈ నెల 19వ తేదీన ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అవిశ్వాస తీర్మానానికి సమయం సమీపిస్తుండడంతో కారు పార్టీలో నాయకుల మధ్య మరింత దూరం పెరిగింది.

కాంగ్రెస్ నాయకులతో చర్చలు

కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా టీఆర్ఎస్‌కు 24 మంది కౌన్సిలర్లు, సీపీఐకి 8, కాంగ్రెస్‌కు ఒకటి, ఇద్దరు ఇండిపెండెంట్‌లు పాలక వర్గంలో ఉన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు గులాబీ గూటికి చేరడంతో టీఆర్ఎస్ బలం 29కి చేరింది. దీంతో ఎన్నికల అనంతరం అదే పార్టీలోని కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఒక వర్గం కాగా, మరో టీఆర్ఎస్ కౌన్సిలర్ భీమా శ్రీవల్లి, భర్త భీమా శ్రీధర్ మరో వర్గంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటి పాలక వర్గం అవిశ్వాస తీర్మానానికి ముందే పలువురు కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ అగ్ర నాయకులతో చర్చలు జరుపుతున్నారనే ప్రచారం ఉంది.

బేరసారాలు.. క్యాంపులు

రాష్ట్ర వ్యాప్తంగా మారిన రాజకీయాల దృష్ట్యా బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన పాలక వర్గాలపై కాంగ్రెస్ నాయకులు అవిశ్వాస తీర్మానాలు పెడుతుండగా కొత్తగూడెంలో భిన్నంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులే అవిశ్వాస తీర్మానానికి తెరలేపడం చర్చనీయాంశంగా మారింది. అవిశ్వాస తీర్మానంలో తమ వర్గాన్ని గట్టెక్కించుకునేందుకు పలువురు కౌన్సిలర్లు పావులు కదుపుతూ బేరసారాలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. 19వ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో కౌన్సిలర్లను క్యాంపులకు తరలించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. దూర ప్రాంతాలకు తీసుకెళ్లి అవిశ్వాస తీర్మానం రోజే కొత్తగూడెం తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. విజయమే లక్ష్యంగా కౌన్సిలర్లు పావులు కదుపుతూ ముందుకు సాగుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంలో నెగ్గాలంటే 19 మంది కౌన్సిలర్లు మద్దతు అవసరం ఉండగా అవిశ్వాస తీర్మానానికి ఇచ్చిన ఫిర్యాదులో 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేయడంతో పాలకవర్గం తమ అనుకూలమైన వారికి దక్కే అవకాశం ఉంది. అవిశ్వాస తీర్మానంపై బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠాన వర్గం ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం గమనార్హం. ఇటీవల నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాలు జరిగినప్పటికి ఆ పార్టీకి చెందిన అగ్ర నాయకులు హాజరైనా అవిశ్వాసంపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడం గమనార్హం.

గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.వీరూనాయక్

భద్రాచలం, ఫిబ్రవరి 5: భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. వీరునాయక్‌ను భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సోమవారం నియమించారు. గిరిజన సంక్షేమ శాఖలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 31 సంవత్సరాలుగా పని చేస్తున్న వీరునాయక్ గతంలో గిరిజన బీఈడీ కళాశాల స్థాపన నుంచి ఎనిమిది సంవత్సరాలు అధ్యాపకుడిగా పని చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పీహెచ్‌డీ పూర్తి చేసిన వీరునాయక్‌కు నియామకపు ఉత్తర్వులు ఇస్తూ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ అభినందించారు.

ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 5: వాతావరణ మార్పులు, పొగమంచు తీవ్రమవుతున్న క్రమంలో ఆశ్రమపాఠశాలలు, గురుకులాల్లో చదివే విద్యార్థులు తెల్లవారుజాము సమయంలో బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారు నిర్వహించారు. ఈ సమయంలో విషపూరితమైన క్రిమి కీటకాలు తెల్లవారుజామున సంచరించే అవకాశం ఉందని ఇందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గిరిజన దర్బారుకు వచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్వో సురేష్‌బాబు, ఆర్వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పథకాలను నిలిపివేశారు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 5: ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాలను అమలు చేయకపోగా, ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. సోమవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడిచినా, గ్యారెంటీల అమలు ఏదని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు ఒక గ్యారెంటీ పథకంలో పావుభాగమేనని, కానీ ప్రజలను మభ్యపెట్టి రెండు పథకాలు అమలు చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత కాంగ్రెస్ కనుమరుగు అవుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. నిరుద్యోగభృతి ఇస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి, ప్రియాంకగాంధీ హామీ ఇస్తే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసలు హామీనే ఇవ్వలేదని అంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారని, ప్రస్తుతం విద్యుత్,సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీరు లేక పాలేరు రిజర్వాయర్ గేట్లను రైతులే ఎత్తివేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇటువంటి సంఘటనలు జరిగాయా? అని తాతా మధుసూదన్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. మంగళవారం ఓటు నమోదుకు గడువు ముగుస్తుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, కొల్లు పద్మ, దోకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

జాలిమూడి కాల్వ పూడికతీత ప్రారంభం



కాల్వ పూడికతీత పనులు జరుగుతున్న దృశ్యం

మధిర రూరల్, ఫిబ్రవరి 5: మధిర మండలంలోని జాలిమూడి, మల్లారం, రొంపిమళ్ల, సిరిపురం, వంగవీడు, బోనకల్ మండలంలోని కలకోట గ్రామాల పంటపొలాలకు సాగునీరందించే జాలిమూడి ప్రాజెక్టు కాలువల పూడికతీత పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అత్యంత గుర్తింపునిచ్చిన జాలిమూడి ప్రాజెక్టు వందల ఎకరాలకు నీటిని అందిస్తుంది. కాల్వల్లో పూడిక ఏర్పడటంతో రొంపిమళ్లతోపాటు పరివాహక గ్రామాల రైతులు సమస్యను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విన్నవించారు. స్పందించిన ఆయన కాల్వ పూడికతీతకు, జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసి వెంటనే పనులను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిన భట్టి విక్రమార్కకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. జాలిమూడి నుంచి రొంపిమళ్ల వరకు గైడ్‌వాల్‌ను మంజూరు చేసి రైతుల కలను సాకారం చేయాలని గ్రామ రైతులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలి

సత్తుపల్లి, ఫిబ్రవరి5: సింగరేణి సంస్థ ఉద్యోగులు అందరూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసేందుకుగానూ కష్టపడి పనిచేయాలని సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు అన్నారు. సోమవారం జేవీఆర్ ఓసీలో పలు శాఖల ఉద్యోగ బృందాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించే క్రమంలో రక్షణతో కూడిన కృషి జరగాలన్నారు. జేవీఆర్ ఓసీలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో డీజీఎం (ఐఈడీ) ఎన్.యోహాన్, జేవీఆర్ ఓసీ పీవో ఎస్.వెంకటాచారి, ఏజీఎం ఫైనాన్స్ కే.హనుమలత, ప్రాజెక్టు ఇంజనీర్ లక్ష్మణమూర్తి, మేనేజర్ నరసింహారావు, రక్షణ అధికారి రాందాస్, సీనియర్ పీవో దేవదాస్ పాల్గొన్నారు.

గనుల్లో మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం పర్యటన

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 5: 'మన సంస్థ, మన గని, మన బాధ్యతలను' వివరించే మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం సోమారం మణుగూరు ఏరియాలో పర్యటించింది. బృందం సభ్యులు మణుగూరు ఓసీ గని, కొండాపురం భూ గర్భ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గనుల్లో మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో బృందం కన్వీనర్, ఏరియా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడారు. అంకిత భావంతో సమష్టిగా పనిచేయాలన్నారు. 2024-25 సంవత్సర లక్ష్యం 770 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ కే వెంకట్రావ్, డీజీఎం పర్సనల్ సలగల రమేష్, డీజీఎం ఎఫ్అండ్ఏ అనురాధ, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 5: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి విభాగం ప్రధానాచార్యులు డాక్టర్ సత్యనారాయణ అన్నారు. నాలుగు రోజుల పాటు యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాల ల విద్యార్థిని విద్యార్థులకు జరిగే క్రీడా పోటీలను సోమవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఘనంగా ప్రారంభించా రు. యూనివర్సిటీ పరిధిలోని 11 కళాశాలలకు చెందిన 430 మంది విద్యార్థులు వివిధ రకాల క్రీడా పోటీలలో పాల్గొనేందుకు వచ్చారు. ప్రారంభంలో అతిథులకు స్వాగతం పలుకుతూ క్రీడాకారులు ప్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడానికి, మేథోశక్తిని పెంచుకోవటానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో రా ణించాలన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వ్యవసాయ సాంకేతికను తెలుసుకొని తమ చుట్టూ ఉన్న రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా డా. జగదీష్, ఆదిలాబాద్ సీఐ హాజరయ్యారు. విశ్వవిద్యాలయ పరిశీలకుడిగా పూర్వ విద్యార్థి డా. జె సురేష్ వ్యవహరించారు. ప్రొ. జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని పలు కళాశాల విద్యార్థులు వివిధ రకాల పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ఓఐఎస్‌ఏలు, పీటీలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యూనివర్సిటీ ప్రతినిధులు



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణ



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల క్రీడాకారులు

నేటి నుంచి ఇంటర్ డీఏఈ క్రీడా సాంస్కృతిక పోటీలు

8 అణుశక్తి యూనిట్ల నుంచి క్రీడాకారుల రాక

అశ్వాపురం ఫిబ్రవరి 5: భారత అణుశక్తి విభాగం 38 వ జాతీయ క్రీడా,సాంస్కృతిక పోటీలు మంగళవారం అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలోని కళావేదికలో వైభవంగా ప్రారంభం కానున్నాయి. పోటీల విజయవంతానికి మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ జీఎం ఎస్.జగ్గారావు ఆధ్వర్యంలో పలు కమిటీలు నియమించారు. ప్రతి ఏడాది జరిపే క్రీడా పోటీల్లో భాగంగా ఈఏడాది సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న 8అణుశక్తి యూనిట్ల నుంచి సుమారు 200మంది కళాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. అణుశక్తి విభాగం పోటీలు ఈనెల 10 వరకు కొనసాగనున్నాయి. ప్రారంభ పోటీలకు భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అలా ముఖ్యఅతిథిగా హాజరుకానుండగా, ముగింపు పోటీలకు హెవీవాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎస్.సత్యకుమార్, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి సీమాశర్మజైన్‌లు ముఖ్యఅతిదులుగా హాజరుకానున్నారు. కాగా పోటీల విజయవంతానికి జీఎం పర్యవేక్షణలో డీజీఎం హరీష్‌కుమార్ వర్మ నేతృత్వంలో ఆహ్వాన కమిటీ, రవాణాకమిటీ, క్యాంటిన్, వసతి కమిటీ, ప్రారంభ,ముగింపు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు సోమవారం ప్లాంట్ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో జీఎం వెల్లడించారు. కార్యక్రమాల విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. విలేకరుల సమావేశంలో డిజిఎం హెచ్.కె.శర్మ,సిఏఓ వేణు, ఐఆర్‌వో లత, నిర్వాహణ కార్యదర్శి వాగ్‌మోడె పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి క్రీడాకారులు రానున్న నేపథ్యంలో ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సేల్స్ రంగంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే ఆంధ్రజ్యోతి మీకు మంచి అవకాశం కల్పిస్తోంది మీరు చేయవలసినదల్లా ఆంధ్రజ్యోతి దినపత్రికకు చందాదారులను చేర్పించటమే
ఆసక్తి ఉత్సాహము గల అభ్యర్థులకు సేల్స్ రంగములో మెళకువలు నేర్పించి తగిన శిక్షణ ఇవ్వబడును.
- నెలసరి వేతనం రూ.9000/-.
- బుక్‌చేసిన కాపీ ఒక్కింటికి రూ.70/- ల చొప్పున ఇన్సెంటివ్ ఇవ్వబడును.
- ప్రతి ఒక్కరూ నెలకు సుమారు రూ.14,500/- పైన ఆదాయం పొందే అవకాశం కలదు.

అర్హతలు
1. వయస్సు: 19-30 సంవత్సరాల యువకులకు ఇది ప్రత్యేకం.
2. తెలుగులో అనర్గళంగా మాట్లాడగలగాలి.
3. విద్యార్హత: ఎస్.ఎస్.సి ఆపైన...

కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు, అశ్వారావుపేట ప్రాంతాలలో పనిచేయుటకు ఆసక్తిగలవారు వెంటనే ఈ క్రింది నెంబర్లలో సంప్రదించగలరు.
కొత్తగూడెం: నరసింహారావు - 6281041854, చారి - 7989609850.
పాల్వంచ: రాము - 9959112053.
భద్రాచలం: రాంబాబు - 9985448412
మణుగూరు: శ్రీనివాస్ - 9676771984
ఇల్లందు: ప్రసాద్ - 9390907099
సత్తుపల్లి: రంగ - 9985439924
సర్క్యులేషన్ మేనేజర్, ఖమ్మం: 9985411350

తూము కాల్వ పూడ్చివేత.. రోడ్లపైకి మురుగు

హనుమాన్‌నగర్‌వాసుల ఆందోళన

సత్తుపల్లి మునిసిపల్ అధికారుల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 5: తూము కాలువను మట్టితో పూడ్చడంతో ఆటంకం ఏర్పడటంతో మురుగు నీటితో సమీపంలోని కాలనీ రోడ్లపై చేరింది. దీంతో కాలనీ వాసులు ఆందోళన చేశారు. మునిసిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడంతో ప్రజలు శాంతించారు. ఈ సంఘటన సోమవారం సత్తుపల్లి పట్టణం హనుమాన్ నగర్‌లో చోటుచేసుకుంది. 'ఏళ్ల తరబడి మురుగు సమస్యతో సతమతమవుతున్నాం.. మా గోడు వినేవారేలేక నానా అవస్థలు పడుతున్నామని, ఏ పాలకులు వచ్చినా తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని' హనుమన్‌నగర్ శివారు ప్రాంత ప్రజలు వాపోయారు.



కాలువ తీసే పనులను పర్యవేక్షిస్తున్న మునిపల్ చైర్మన్ కాస్తా

తూము కాలువ ద్వారా..

వేశ్య కాంతల చెరువుకు చెందిన తూము కాలువ ద్వారా పట్టణంలోని మురుగు నీరు దిగువనున్న తమ్మిలేరు వాగులోకి చేరుతాయి. కాగా తాజాగా ఎన్టీఆర్ వరద నీటికాలువ కింద బండి సునీత తన స్థలానికి ఆనుకుని వెళ్తున్న తూము కాలువలో మట్టి పోయడంతో మురుగు సమీపంలోని ఇళ్లు, రోడ్లపైకి చేరింది. దీంతో ఆందోళన చేస్తుండగా సమాచారం అందుకున్న మునిసిపల్ కమిషనర్ కే.సుజాత, చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రత్యామ్నా యంగా జేసీబీ సహాయతో మరోవైపు కాలువ తీసి మురుగు నీటిని మళ్లించారు. అయితే సదరు భూమి యజమాని సునీత సైతం కాలువలో పోసిన మట్టిని తొలగించడంతో కాలనీవాసులు ఆందోళనను విరమించారు.



హనుమాన్ నగర్‌లో ఇళ్లలోకి చేరిన మురుగునీరు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం

- ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం
- కలెక్టర్ హెచ్చరించినా పూర్తికాని పనులు

సత్తుపల్లి, ఫిబ్రవరి3: సత్తుపల్లి మునిసిపాలిటీలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఈ పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. సత్తుపల్లి పట్టణంలో రూ.4.5కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ మంజూరు చేశారు. మునిసిపల్ కార్యాలయం పక్కనే వీటి నిర్మాణా లను చేపట్టారు.

2021లో శంకుస్థాపన

2021ఏప్రిల్ 2వ తేదీన అప్పటి పరిశ్రమలు, ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి కేటీఆర్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పబ్లిక్ హెల్త్, మునిసిపల్, ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభించారు. టెండర్లు నిర్వహించి 2022 జనవరిలో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించిన సమయంలో 6నెలల కాలంలో పూర్తి చేయాలని అగ్రిమెంట్ చేశారు. కానీ కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయకపోవడంతో అప్పటి నుంచి కాంట్రాక్టర్‌కు తిరిగి అగ్రిమెంట్ పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఇప్పటికీ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణం స్థానికులను అసంపూర్తిగా వెక్కిరిస్తుంది.

జిల్లా కలెక్టర్ హెచ్చరించినా...

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను రెండు, మూడు పర్యాయాలు జిల్లా కలెక్టర్ పరిశీలించి పనులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తంచేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వ ప్రాధాన్యతలను బట్టి పనులను నిలిపివేశారు. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు అవుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. సకాలంలో పనులు పూర్తిచేసి ఉంటే స్థానికులకు ఇది అందుబాటులోకి రావడంతో పాటు పనుల కొనసాగింపుపై సందేహాలు ఉండేవి కాదు. సంబంధిత అధికారులు కూడా సకాలంలో పనులు పూర్తి చేయకపోవడం వలనే నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది అని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సత్తుపల్లిలో నిర్మాణంలోని వెజ్, నాన్ వెజ్ మార్కెట్



జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో

గౌతమ్‌కు రజతం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 5: చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా 6వ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో నగరానికి చెందిన అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారుడు అల్లూరి గౌతమ్ సత్తా చాటి రజత పతకం సాధించాడు. జాతీయ పోటీల్లో తెలంగాణా రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గౌతమ్ 200 మీటర్ల పరుగు పోటీలు ద్వితియ స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ పోటీలలో ప్రతిభ చూపిన గౌతమ్‌ను సోమవారం కలెక్టర్ గౌ తమ్, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యద ర్శి షఫీక్ అహ్మద్‌లు అభినందించారు.



గౌతమ్‌ను అభినందిస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

BUSINESS OFFER
★ Sri Avani Eco-life Pvt. Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారిగా డీలర్లు కావలెను. Ph:9493786468 / 6301041696.
AJH-13362

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

స్వదేశాగమనము/ విదేశీయానం. | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం | షష్ఠిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి | పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

రైతులకు అందుబాటులో ఉండాలి: మంత్రి తుమ్మల



రాఘవరావును సత్కరిస్తున్న మంత్రి

దమ్మపేట, ఫిబ్రవరి, 5: దమ్మపేట విశాలసహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఎల్లిన రాఘవరావును వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గండుగులపల్లిలో తన వ్యవసాక్షేత్రంలో సోమవారం సాయంత్రం ఆయనను సత్కరించారు. తుమ్మల మాట్లాడుతు రైతుల సమస్యలను పరిష్కరించాలని, రైతులకు అందుబాటులో వుండాలని సహకారం సంఘాన్ని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. చైర్మన్ రాఘవరావుతో పాటు డైరెక్టర్లను కాంగ్రెస్ నాయకులను తుమ్మల అభినందించారు. ఇదే స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేయాలన్నారు. తుమ్మలను కలిసిన వారిలో దొడ్డా ప్రసాదు, ఎల్లిన మురళి, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాదు ,కొయ్యల అచ్యుతరావు, కొర్సా సాగర్, మన్నెం అప్పారావు, రాధయ్య, రావు రవిశంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందాలి

- సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు
- దమ్మపేట సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే జారే
- అశ్వారావుపేటలో బస్టాండ్, ఆసుపత్రి తనిఖీ
- పట్టణంలో వీది వ్యాపారులతో ముచ్చట్లు

దమ్మపేట/అశ్వారావుపేట, ఫిబ్రవరి, 5: ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించే బాధ్యతర అధికారులదేనని సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సున్నితంగా హెచ్చరించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సోయం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు ఈసందర్భంగా మండలంలో ప్రధాన శాఖాల అభివృద్దిపై సమీక్షించారు. వ్యవసాయశాఖ పనితీరు మెరుగుపరుచుకోవాలని, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో మండల తోటలకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. మిషన్ బగీరథ సమీక్షలో వచ్చే వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అందుకోసం 50లక్షల రూ.లు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైద్యశాశా పనితీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నెలరోజులలో పేదలకు వైద్య నిమిత్తం నియోజకవర్గ ప్రజలకు రూ.1.70 కోట్లు ప్రభుత్వం నుంచి ఎల్ఓసి ఇవ్వటం జరిగిందని అన్నారు. మండలంలో ఎమ్మెల్యేగా పని చెబితే కనీసం సమస్యను పట్టించుకోక పోవటం పై అధికారి తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.



వైద్యశాఖ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

ఎన్నారైల సహకారం

అశ్వారావుపేట నియోజక వర్గంలో 340 మంది ఎన్నారైలు వున్నారని వారంతా అశ్వారావుపేట నియోజక వర్గ అభివృద్ధి స్వచ్చందగా సేవ చేసేందుకు ముందుకు వచ్చారని వారి సహకారంతో విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం మర్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో ప్రత్యే అధికారుల పాలన ప్రారంభమైందని సర్పంచులు కంటే ప్రత్యే అధికారులు పాలన మెరుగ్గా వుండాలన్నారు. అనంతరం పదవీ కాలన్ని పూర్తి చేసుకున్న మండలంలోని 31 మంది సర్పంచులను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. సమావేశంలో జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, సొసైటి అధ్యక్షుడు ఎల్లిన రాఘవరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీవో రామారావు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్కా బాగున్నావా? పెద్దయ్య బాగున్నావా?

వీధివ్యాపారుల సమస్యలను తెలుసుకున్న జారే

అశ్వారావుపేట: అక్కా బాగున్నావా? పెద్దయ్య ఎలా ఉన్నావు? వ్యాపారాలు ఎలా ఉన్నాయి? రిక్షాలాగితే రోజుకు ఎంత ఆదాయం వస్తుందంటూ వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులను ఆప్యాయంగా పలుకరిస్తూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పట్టణంలో కలియ తిరిగారు. అశ్వారావుపేట . సోమవారం రా త్రి అయన ఓ ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లి వస్తూ అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగ తనిఖీ చేసారు. బస్టాండు అపరిశుభ్రంగా ఉందని, మరుగు దొడ్లు పనిచేయడం లేదని ప్రయాణీకులు తెలిపారు. అనంతరం ఆయన ఆర్టీసీ ఆర్ఎంకు ఫోన్ చేసి బస్టాండ్‌ను విజిట్ చేసి ఈ సమస్యలను పరిష్కరించాలని ఫోన్ చేసి వివరించారు. తరువాత బస్టాండ్ నుంచి రింగ్‌రోడ్డు వరకు వీది వ్యాపారులు, దుకాణ దారులు, రిక్షా నడుపుకునేవారితో ఆప్యాయంగ పలుకరిస్తూ కలియ తిరిగారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని రింగ్ రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద గోతులను పరిశీలించారు. ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావుతో మాట్లాడి మంగళవారం సాయంత్రానికల్లా గోతులు పూడ్చివేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగ తనిఖీ చేసారు. వీధి వ్యాపారులు, పలు వాణిజ్య సంస్థల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈయనతో పాటు జూపల్లి ప్రమోద్, బండి చెన్నారెడ్డి, ఎంపీటీసీ మిండా హరిబాబు, బాబీ తదితరులు ఉన్నారు.



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వాసంపై న్యాయ విచారణ జరపాలి

- మునిసిపల్ కౌన్సిలర్ల ఆందోళన

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 5: ఇల్లెందు మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణం ఇచ్చిన కౌన్సిలర్లు సమావేశం ముగించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా పోలీసులు, అధికారులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని, ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై ప్రజాస్వామ్యబద్ధంగా చట్టానికి అనుకూలంగానే అవిశ్వాస తీర్మాణంకు మెజార్టీ కౌన్సిలర్లు నోటిసులు ఇచ్చారని వివరించారు. అవిశ్వాస తీర్మాణం సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికం అన్నారు. ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లును సమావేశానికి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పక్షపాతంగా వ్యవహరించారని విమర్శించారు. అనంతరం తమ కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మూడో వార్డు కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరావును కాంగ్రెస్ నాయకులు కిడ్నప్ చేశారని, వెంకటనే నాగేశ్వరావును సమావేశానికి తీసుకరావాలని ఆయన కుటింబికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి, ఆదోళన చేశారు. కోక్కు నాగేశ్వరావు భార్య లక్ష్మి, కూతురు సరితలు ఆందోళనకు పూనుకున్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహింస్తున్న కౌన్సిలర్లు

మీడియాపై కౌన్సిలర్ల ఆగ్రహం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అనంతరం కోపోద్యక్తులైన కౌన్సిలర్లు మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి పరుడైన చైర్మన్‌ను కాపాడేందుకే మీడియా ఇక్కడ ఉన్నా రా..? దొంగ లంజకోడుకు చైర్మన్ అంటు ధ్వజమెత్తారు. మా కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తుంటే, మీరు అందరు ఏం చేస్తున్నా రు. ఏవరి కోసం పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ల తీరుపట్ల పలువురు జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు.

అవిశ్వాసం వీగిపోయింది: ప్రిసైడింగ్ అధికారి, కొత్తగూడెం ఆర్డీవో శిరీష

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 5: ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై 19 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని ప్రిసైడింగ్ అధికారి, కొత్తగూడెం ఆర్డీవో శిరీష తెలిపారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ 19మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ఇవ్వగా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించగా కేవలం 15మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారని, కోరం పూర్తి కాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని, దాంతో సమావేశం వాయిదా వేసినట్లు ప్రకటించారు. తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదన ఇవ్వనున్నట్లు ఆర్డీవో ప్రకటించారు.

ప్రతి కార్మికుడు హక్కుల కోసం కదలాలి

- దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్
- అధికారులకు నోటీసుల అందజేత

కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి)/ పినపాక/జూలూరుపాడు/పాల్వంచ/మణుగూరుటౌన్: ఈ నెల ఫిబ్రవరి 16వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో అన్ని రంగాల కార్మికులు సమ్మెను జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ సోమవారం పిలుపునిచ్చారు. కొత్తగూడెం పట్టణంలో ఉన్న పెట్రోల్‌బంక్, ఆటో, షాప్ ఎంప్లాయి తదితర కార్మికుల వద్ద సమ్మె విజయవంతం కోసం విస్తృతంగా ప్రచారం జరిగింది. సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి డి. వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి: సీపీఎం

పినపాక: 16 న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని, సమ్మె తో బీజేపీ కుట్రలను తిప్పి కొట్టి ప్రజా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్లోని జీవీఆర్ ఫంక్షన్ హాల్లో నట్టి శంకరయ్య అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశం జరిగింది. సీపీఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న, సభ్యులు దుబ్బా గోవర్ధన్, రమేష్, జోగయ్య, రమేష్, శంకర్, పాల్గొన్నారు. జూలూరుపాడు, పాల్వంచ, మణుగూరులో అధికారులకు కార్మికులు సమ్మె నోటీసులు ఇచ్చారు.

తాజా మాజీ సర్పంచ్‌లకు సన్మానం

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి5: ఇల్లెందు మండలం రేపల్లేవాడ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేశారంటూ సోమవారం రాజకీయలకు అతితంగా గ్రామస్థులు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. పదవీకాలం ముగిసిన సర్పంచ్ ఆలేం కౌసల్యతో పాటు వార్డు సభ్యులను ఘన సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూక్య మోహన్, ఉప సర్పంచ్ పోటు రవి, పంచాయతీ గుమస్తా మోహన్‌రావు, సోసైటి డైరెక్టర్ కోమరయ్య, పూనెం శ్రీరాములు, లక్ష్మణ్ స్వామి , కల్తీ స్వామి, ముత్యాలు, ఆలేం కృష్ణ, సుత్రాపు సమ్మయ్య, హనుమంతు, వెంకటనారాయణ, బట్టు కోటి, కనకయ్య, రాములు, దూప్‌సింగ్, నాగరాజు ఉన్నారు.

అశ్వారావుపేట: మండల పరిధిలోని గుర్రాలచెరువు సర్పంచ్ కలపాల దుర్గయ్యకు సోమవారం గ్రామస్థులు ఘనంగా వీడ్కోలును ఏర్పాటు చేశారు. గ్రామస్థులంతా శాలువా కప్పి సత్కరించారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ఎంపీటీ సీ నండ్రు జయభారతి, ఉప సర్పంచ్ పైడి శ్రీనివాసరావు, కార్యదర్శి తేజ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి: కూనంనేని

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 5: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని అధికారులను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. సోమవారం పట్టణ పరిధిలో పలు వార్డుల్లో రూ. 5.58 కోట్ల వ్యయంతో చేపట్టు పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానని, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేస్తామని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మునిసిపల్ కమీషనర్ స్వామి, తహసీల్దార్ నాగరాజు, మునిసిపల్ డీఈ మురలి, ఏఈ రాజేష్, సీడీపీఓ కనకదుర్గ, ఎలక్ట్రికల్, మిషన్ భగీరధ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

వైభవంగా అయ్యప్ప ఆలయ ప్రథమ వార్షికోత్సవం

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 5: తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన పాల్వంచలోని అయ్యప్ప దేవాలయం ప్రథమ వార్షికోత్సవ పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి పూజారి బృందావనం నరసింహమూర్తి ఆధ్వర్యంలో గణపతిహోమం, మహాభిషేకం, స్వామివారి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార కమిటీ అధ్యక్షులు రాజ్‌దేశ్‌పాండే, ఆలయ కమిటీ సభ్యులు కనగాల రాంబాబు, కమలాకర్, శంకర్‌మణి, వేమారెడ్డి, నాగేందర్, బీఎస్ చారి, ఎస్‌పీ చారి, రెడ్డి, ప్రసాద్, కందుకూరి రాము, రాంబాబు, లింగయ్య రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

లెప్రసీపై విద్యార్థులకు అవగాహన

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 5 : మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎస్ఎల్‌పీసీ(స్పాక్) అవగాహన కార్యక్రమాల్లో బాగంగా సోమవారం కుష్టు వ్యాదిపై పరిసర గ్రామాలతో పాటు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఇందులో బాగంగా విద్యార్థులకు కుష్టు వ్యాది లక్షణాలు, తీసుకోవాల్సి జాగ్రత్తలపై డాక్టర్ శివకుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కుష్టు వ్యాదికి పీహెచ్‌సీలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది రాంప్రసాద్, రవి, చంద్ర, రాధ, భవాని పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యానికనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని సాధించాలి: జీఎం

రుద్రంపూర్, ఫిబ్రవరి 5: సింగరేణి సంస్థ చైర్మన్ బలరాం ఆదేశాల మేరకు సంస్థలోని ఉద్యోగులందరు నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసి వినియోగదారులకు అందించే విధంగా కృషి చేయాలని నిర్ధేశించిన లక్ష్యానికనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని సాధించాలని కొత్తగూడెం జనరల్ మేనేజర్ షాలేం రాజు అన్నారు. సోమవారం జేవిఆర్ఓసి నందు మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జేవీఆర్ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.వెంకటాచారి, ఏజీఎం (ఫైనాన్స్) కె.హేనాసుమలత, డీజీఎం (ఐఈడి) ఎస్.యోహాన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ఘనసన్మానం

అశ్వాపురం ఫిబ్రవరి 5: వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను సోమవారం అశ్వాపురం శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా స్వానించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లి తిరుగుప్రయాణంలో అశ్వాపురంలో ఎస్‌కెటి ఇంట్లో ఎమ్మెల్యే తేనేటి విందు స్వీకరించారు. ఈందర్భంగా ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రమేష్, స్థానికులు శ్రీనివాసరావు,రామలింగేశ్వరరావులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన యువకుడికి సన్మానం

జూలూరుపాడు, ఫిబ్రవరి 5: మండలంలోని జడలచింత గ్రామానికి చెందిన కిలారి సురేష్ ఉస్మానియా విద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. దీంతో సోమవారం జడలచింత గ్రామంలో సురేష్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు శాలువలు కప్పి సన్మానించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, పార్టీ వైరా నియోజకవర్గ ఎ-బ్లాక్ అధ్యక్షుడు నున్నా కృష్ణయ్య, పార్టీ జిల్లా షోషల్‌మీడియా కో-ఆర్డినేటర్ నవీన్‌రాథోడ్, ఓబిసి జిల్లా అధ్యక్షులు అరిగెల నరసింహారావు, సాయిన్ని శ్రీనివాసరావు, రాయపాటి సత్యనారాయణ, నున్నా రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం: ఎంపీడీవో

జూలూరుపాడు/కరకగూడెం ఫిబ్రవరి5: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు స్థానిక ఎంపిడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సోని అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని పంచాయతీ ప్రత్యేక అధికారులతో పాటు అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కరకగూడెం: ఃమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు 10:30 గంటలకు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కుమార్ పాల్గొన్నారు.

ఓటు విశిష్టతను తెలియజేయాలి

అశ్వాపురం ఫిబ్రవరి 5: ఎమ్మెల్సీ ఓటు విశిష్టతను పట్టభద్రులకు తెలియజేసి, అర్హులైన ప్రతీఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలని తహసీల్దార్ స్వర్ణలత అన్నారు. సోమవారం బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మంగళవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు చివరి తేదీ కావటంతో అర్హులైన ప్రతిఒక్కరికీ ధృవీకరణ పత్రాలు అందజేసి గెజిటెడ్ సంతకం చేసిన తర్వాత తీసుకోవాలన్నారు. ఓటు నమోదులో బీఎల్‌వోలు అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. సమావేశంలో ఎంపీడీవో వరప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రషీద్‌లు పాల్గొన్నారు.

వలస ఆదివాసీలకు దుస్తుల పంపిణీ

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 5 : మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన పెద్దిపల్లి గ్రామంలోని గిరిజనులకు, చిన్నారులకు సోమవారం దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. దీంతోపాటు చిన్నారులకు ఆహార ప్యాకెట్లను ట్రస్ట్ చైర్మన్ రాధా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలోని చిన్నారులు, పెద్దలు రక్త హీనత సమస్యతో బాధపడుతున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని ఆమే ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారులను కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అటవీఉత్పత్తుల విక్రయాల్లో దళారులను నమ్మొద్దు

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 5: మారుమూల గ్రామాల్లో అటవీఉత్పత్తుల సేకరణలోని ముష్టి గింజలను గిరిజన, గిరిజనేతరులు దళారులకు విక్రయించి నష్టపోవద్దని మర్కోడు జీసీసీ సెల్స్‌మెన్ మొగిలి రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీసీసీ డివిజనల్ మేనేజర్ విజయ్‌కుమార్ ఆదేశల మేరకు, జీసీసీలో ముష్టి గింజలను రూ.45లు కొనుగోలు చేస్తున్నామని, కొందరు దళారులు పల్లెలోకి వచ్చి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారని, ముష్టిగింజలు విక్రయించాల్సిన వారు మర్కోడు, ఆళ్లపల్లి జీసీసీలో విక్రయించి లాభాలు ఆర్జించవచ్చు అన్నారు. ముష్టిగింజలు దళారులు కొనుగోలు చేస్తు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అటవీ చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఎఫ్ఆర్వో

జూలూరుపాడు, ఫిబ్రవరి 5: ప్రజలు అటవీ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని జూలూరుపాడు అటవీరేంజ్ అధికారి ప్రసాద్‌రావు హెచ్చరించారు. సోమవారం మండలంలోని సూరారం గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాలలో అటవీని ప్రజలు అక్రమంగా అడవిని నరికి కొత్తగా పోడు సాగు చేయవద్దు అని అడవి జంతువులను వేటాడవద్దు అని అన్నారు. గ్రామ సభలో డిప్యూటీ డీఆర్వో ధనలక్ష్మీ, ఎఫ్‌బీవోలు నరసింహారావు, శ్రీలత, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, గ్రామస్తులు హరిలాల్, జగన్నాధం, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 5: రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, రామాలయంకు వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూధన్ రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, డీఆర్ఓ దరఖాస్తు చేసిన అభ్యర్దుల వివరాలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల ఎదుగుదల కీలకం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి5: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల ఎదుగుదల ఎంతో కీలకమని ప్రాథమిక విద్య కొత్తగూడెం నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ సూచించారు. సోమవారం పట్టణంలోని నేతాజీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మాట్లాడారు. చిన్నతనంలోనే విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారి పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తే నైపుణ్యం గల విద్యార్థులుగా రాణించేలా దోహదపడతారని అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/భద్రాచలం, ఫిబ్రవరి 5: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావును కోరారు. సోమవారం డిపో గ్యారేజీలో ఉద్యోగులకు ట్యూటీలు వేసే విభాగం వద్ద స్వయంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా వివరించారు. ఆఖమ్మం, ఇల్లెందు సర్వీస్‌లలో స్పెషల్ డ్యూటీలు చేయాలని, భద్రాచలం, రాజమండ్రి డ్యూటీలలో కిలో మీటర్లను తగ్గించాలని డీఎంకు తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని కార్మికులు, ఉద్యోగులు మరో సారి డీఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సామేలు, జాకబ్, కెఎస్.రావు, బిఎస్.రావు, నూర్జహాన్, రాజ్యలక్ష్మీ, శివరామకృష్ణ, రాములు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలం: సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్మికులను కలుసుకుందాం సమస్యలను తెలుసుకుందాం కార్యక్రమంలో భాగంగా సోమవారం భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న ఉద్యోగులను ఎస్.డబ్ల్యు.ఎఫ్(సీఐటీయు) రాష్ట్ర నాయకులు కలిసారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రీజియన్ అధ్యక్షులు బి.రాంబాబు, కార్యదర్శి పి.సుధాకర్‌లు డిపోలో ఉన్న ఉద్యోగులను కలిశారు.

ఇంటర్ మూల్యాంకన కేంద్రం ఏర్పాటుచేయాలి

చుంచుపల్లి, ఫిబ్రవరి 5: జిల్లాలో ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రం మంజూరి చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారిని సులోచనరాణికి చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం సోమవారం వేరు వేరుగా వినతి పత్రాలను అందజేశారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రం కేటాయించకపోవడాన్ని గుర్తు చేశారు. భద్రాద్రిలో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తే అధ్యాపకులకు వయోభారంతో పాటు, ప్రభుత్వానికి ఖర్చు కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సభ్యులు వై.మల్లిఖార్జున్‌రావు, కె.కృష్ణమోహన్, ఆర్.చైతన్య, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు జగన్నాథచారి కన్నుమూత

మణుగూరు, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, మండల నాయకుడు కాసర్ల జగన్నాథ చారి '(75) సోమవారం తెల్లారుజామున మృతి చెందాడు. ఇతని మరణ వార్త విన్న వెంటనే తెలుగు దేశం పార్టీ సినియర్ నాయకులు వాసిరెడ్డి, చలపతిరావు, సమితిసింగరాం సర్పంచ్ బచ్చల భారతి, నాయకులు వట్టం నారాయణ తదితరులు చారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర నేత బి అయోధ్య, మండల నాయకులు జంగం మోహన్‌రావు, దుర్గాల సుధాకర్, మున్నాలక్ష్మికుమారి, సోందె కుటుంబరావు తదితరులు చారికి నివాళ్లు అర్పించారు.

'ఎత్తిపోతల పథకం' మాజీ చైర్మన్ మృతి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 5: పెదనల్లబల్లికి చెందిన ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం కమిటీ మాజీ చైర్మన్ బోనాసి వెంకటేశ్వరావు(64) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. గత కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులో మృతిచెందారు. మండల వ్యాప్తంగా సుపరిచితులైన వెంకటేశ్వరావు మృతితో పెదబండిరేవులో విషాద చాయలు అలుముకున్నాయి

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి: సీఐటీయూ

భద్రాచలం, ఫిబ్రవరి 5: కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, పెండింగు వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణకు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయు పట్టణ కన్వీనరు ఎంబి నర్సారెడ్డి, గడ్డం స్వామి, రమాదేవి, నరసింహారావు, ఎంవి రమణ, భవాని, ఎం.చిట్టెమ్మ, జి.మమతా, ఎస్‌కె మహబూబ్, జి.కుమారి, అంజలి పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేయాలి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 5: దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీ పోస్టులను ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు సోమవారం డిమాండ్ చేశారు. కొద్దిరోజుల క్రితం జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సబార్డినేట్ పోస్టును దొడ్డిదారిన భర్తీ చేశారని ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా, సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ పోస్టులన్నీ అధికారిక నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని కోరారు.

టీఎన్‌జీవో టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరణ

భద్రాచలం, ఫిబ్రవరి 5: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం టేబుల్ క్యాలెండర్‌ను భద్రాచలంలోని టీఎన్‌జీవో కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి అమరనేని రామారావు, చైతన్య భార్గవ్, కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ, గాంధీ లింగమూర్తి, కృష్ణ శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, అపర్ణ, అంజిబాబు, క్రాంతి పుల్లారావు, పపారావు, పాషా శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'భవిష్యత్తును తీర్చిదిద్దేది పాఠ్య పుస్తకాలే'

పినపాక, ఫిబ్రవరి 5: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది పాఠశాలలు, పాఠ్య పుస్తకాలేనని దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్టు ఆర్గనైజర్ దోసపాటి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో వార్షిక పరీక్షలు రాయబోతున్న పదోతరగతి చదివే విద్యార్థులు 100 మందికి ట్రస్టు తరపున నోటు పుస్తకాలు, ప్యాడ్లు, జ్యామెట్రీ బాక్స్‌లు, గ్రాఫ్ పుస్తకాలను వితరణగా అందించారు. దోసపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ హెచ్ఎం పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు నరసింహారావు, వీరయ్య రమేష్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

సుజాతనగర్, ఫిబ్రవరి 5: అనారోగ్యంతో మృతి చెందిర ఓ బాధిత కుటుంబానికి పీఎంజేజేబీవై నుంచి మంజూరైన రూ.2 లక్షల భీమా చెక్కును ఏపీజీవీబీ మేనేజర్ ప్రవీణ్ సోమవారం అందజేశారు. జూలూరుపాడు మండలం, కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ బుజ్జి అనే మహిళకు స్థానిక ఏపీజీవీబీలో ఖాతా ఉంది. పీఎంజేజేబీవై పథకానికి ఏడాదికి రూ.436 చెల్లించడంతో మహిళ ఈ పథకానికి అర్హురాలైంది. చెక్కును ఆమె భర్త కిషన్‌కు అందించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ సురేష్, క్యాషియర్ సంధ్యారాణి, సిబ్బంది అరుణ, విజయ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఎఫ్ఎల్‌సీ: కలెక్టర్

కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం, లక్ష్మీదేవిపల్లి మండంలంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలోపి స్ట్రాంగ్ రూంలను, ఈవీఎం, వీవీప్యాట్స్ గోదాములను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలలో 15వ తేదీ వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల మధ్య ఎఫ్ఎల్‌సీ (ఫస్ట్ లెవల్ చెక్) ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవీఎం యంత్రాలను, ఎఫ్ఎల్‌సీ ఈసీఐఎల్ ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ఆదేశాల ప్రకారం కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎం యంత్రాల ఎఫ్ఎల్‌సీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం భద్రాద్రి జిల్లాకు 1588 బ్యాలెట్ యూనిట్లు, 1424 కంట్రోల్ యూనిట్లు, 1683 వీవీప్యాట్స్ యంత్రాలు కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఈవీఎం ప్రక్రియను పరశీలించడానికి మొదటి దశ పరిశీలన అత్యంత ముఖ్యమన్నారు. పనితీరు పరిశీలించడం జరుగుతుందని, ఈవీఎం ఎఫ్ఎల్‌సీ నిర్వహణపై ముందస్తుగా అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం అందించి ఆహ్వానించినట్లు తెలిపారు. 15వ తేదీ వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ నిర్వహిస్తామని, ఈవీఎం యంత్రాల పనితీరుపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ముగిసిన తర్వాత మాక్ పోలింగ్ నిర్వహిస్తామని, అప్పుడు కంట్రోల్ యూనిట్‌లో వచ్చిన ఓట్లు వివిప్యాట్స్ స్లిప్పులతో పరిశీలిస్తామని అన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే ఆలాంటి ఈవీఎం లు ఎన్నికల సంఘ మార్గదర్శకాల ప్రకారం వాపస్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకు ముందు వీవీప్యాట్, ఈవీఎం గోదాముల్లో ఈవీఎం యంత్రాలను, గోదాం సీల్, సీసీ కెమెరాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం తహశీల్దార్ పుల్లయ్య, నాయబ్ తహశీల్దార్ రంగా ప్రసాద్, ఈసీఐఎల్ ఇంజనీర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఎలక్షన్ సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం యంత్రాలను, గోదాం సీల్, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్